క్లుప్తంగా

ప్రశాంతతతోనే ఆరోగ్యం


వృద్ధులను పరీక్షిస్తున్న డాక్టర్ సౌమ్య

అమలాపురం టౌన్: మానసిక ప్రశాంతతతోనే ఆరోగ్యంగా ఉండవచ్చని ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి మానసిక వైద్య నిపుణురాలు సౌమ్య అన్నారు. బుధవారం స్థానిక కరక్కాయపేట సెయింట్ జోసఫ్స్ ఓల్డేజ్ హోమ్‌లో జిల్లా మానసిక ఆరోగ్య కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మానసికంగా ఆరోగ్యంగా ఉండాలంటే తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. మంచి ఆహారపు అలవాట్లు, పౌష్టికాహార పదార్థాలను తెలిపారు. అనంతరం వృద్ధులను పరీక్షించి వారికి అవసరమైన మందులు ఉచితంగా అందజేశారు.

ఆధార్ కేంద్రం పరిశీలన

ఉప్పలగుప్తం: గొల్లవిల్లి సచివాలయంలో ఆధార్ నమోదు కేంద్రాన్ని డీఎల్‌డీవో కె.విజయథామస్, ఎంపీడీవో కె.ఎస్.గౌరీకుమారి పరిశీలించారు. ఆధార్ నమోదు ప్రక్రియను వేగవంతం చేయాలని థామస్ సూచించారు. అదే విధంగా సచివాలయాన్ని తనిఖీ చేసిన ఆయన సచివాలయ ఉద్యోగులకు పలు సూచనలు చేశారు. పంచాయతీ కార్యదర్శి పరమట సాయిబాబు తదితరులు ఉన్నారు.

అభాగ్యులకు అన్నదానం

తాళ్లరేవు: కొప్పిశెట్టి లక్ష్మయ్య బ్రహ్మర్పన్ లయన్స్ ఉచిత అభాగ్యుల భోజన పథకం ద్వారా పలువురికి రాష్ట్ర నాయీ బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ కాపవరపు శ్రీదేవి అన్నదానం చేశారు. బుధవారం ఆమె పుట్టిన రోజు సందర్భంగా పలువురికి భోజనాలు వడ్డించడంతో పాటు పండ్లు అందజేశారు. లయన్స్ క్లబ్ ప్రతినిధులు చోడే శ్రీనివాస్, బి.శ్రీనివాసరెడ్డి, చిట్టూరి చలపతి, వారా సూర్యకుమారి తదితరులు పాల్గొన్నారు.

వరి క్షేత్రాల పరిశీలన


వేట్లపాలెంలో వరి పొలాన్ని పరిశీలిస్తున్న ఏరువాక శాస్త్రవేత్త భవాని

కాట్రేనికోన: ప్రభుత్వం అందించిన ఎంటీయూ-1061, ఎంసీఎం-125, ఎంసీఎం-103 రకాలను సాగు చేస్తున్న వరి క్షేత్రాలను ఏరువాక కేంద్రం శాస్త్రవేత్త భవాని పరిశీలించారు. బుధవారం వేట్లపాలెంలో వ్యవసాయ క్షేత్రాలను ఆమె పరిశీలించి రైతులకు సూచనలు చేశారు. వరి నాట్లు పిలక దశలో ఉన్నందున తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఈ సాగులో బాక్టీరియా, ఆకునల్లి, ఎండి తెగులు సోకినట్లు గుర్తించారు. ఎండు తెగులు నివారణకు ప్లాంటమిషన్ స్ప్రే చేయాలని సూచించారు. మండల వ్యవసాయ అధికారి ప్రవీణ్, సహాయకులు మనోజ్, పంతాడి కృష్ణంరాజు, పిల్లి ధర్మారావు తదితరులు ఉన్నారు.

ఉపాధ్యాయులకు సత్కారం

అల్లవరం: గోడితిప్ప యూపీ పాఠశాలలో విధులు నిర్వర్తిస్తూ బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులను పేరెంట్స్ కమిటీ ఆధ్వర్యంలో బుధవారం సత్కరించారు. ఉపాధ్యాయులు కొనుకు రత్నంరాజు, బోనం నాగమణి, గెద్దం ప్రదీప్‌లను సత్కరించారు. సర్పంచ్ చిట్నీడి శ్రీదేవి, వైస్ ఎంపీపీ వడ్డి గంగ, పేరెంట్స్ కమిటీ చైర్మన్ వేణుగోపాల్, హెచ్ఎం ముత్యాల నరసింహారావు పాల్గొన్నారు.

తులసీదాస్ జయంతి ఉత్సవం

అమలాపురం టౌన్: స్థానిక శ్రీవాగ్దేవి స్కూల్‌లో తులసీదాస్ జయంతి ఉత్సవం బుధవారం జరిగింది. స్థానిక ఆకొండి సింహాచలం ట్రస్ట్ అధ్యక్షుడు ఆకొండి పవన్ విద్యార్థులచే హనుమాన్ చాలీసా పారాయణ గావించారు. చంద్రయాన్-3లోని విక్రమ్ ల్యాండర్ విజయ బావుటా ఎగురవేయడంతో స్కూల్ డైరెక్టర్ పరసా భరత్, ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీరామచంద్ర మూర్తి ఆధ్వర్యంలో సంబరాలు చేసుకున్నారు.

అభివృద్ధి పనులకు నిధులు

యానాం: నియోజకవర్గ పరిధిలో వివిధ అభివృద్ధి పనులకు సీఎస్ఆర్ నిధుల విడుదలకు కమిటీ ఆమోదం తెలిపిందని బుధవారం ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ తెలిపారు. ఆయన విలేకరులతో మాట్లాడుతూ 108 పనులకు గాను 25 పనులను అత్యవసరంగా చేపట్టేందుకు రూ.2.47 కోట్ల మంజూరుకు అంగీకరించిందన్నారు. మరో 33 అభివృద్ధి పనులకు రూ.19.50 కోట్ల మంజూరుకు సైతం కమిటీ ఆమోదం తెలిపిందన్నారు.

ఎయిడ్స్ రహిత సమాజానికి కృషి

యానాం: ఎయిడ్స్ రహిత సమాజానికి అంతా కృషి చేయాలని ప్రాంతీయ విద్యాశాఖాధికారి పంపన లక్ష్మణ్‌ప్రవీణ్ అన్నారు. బుధవారం స్థానిక ఎస్ఎస్ఏ సమావేశ మందిరంలో పుదుచ్చేరి ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ, యానాం విద్యాశాఖ సంయుక్తంగా విద్యార్థులకు క్విజ్ పోటీలను నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందించారు. సమగ్రశిక్ష ఏడీపీసీ కమిడి ప్రభాకర్, ఉపాధ్యాయులు ముమ్మిడి వీరనాగప్రసాద్, కారుమూరి వన సొసైటీ కౌన్సిలర్లు వాణిదాసన్, రఘురామన్ పాల్గొన్నారు.

అద్భుతం.. ఆవిష్కృతం

- చంద్రయాన్-3 ల్యాండింగ్‌తో ఆనందోత్సాహాలు
- శాస్త్రవేత్తల పనితీరుపై ప్రశంసల జల్లు

అమలాపురం టౌన్/ అమలాపురం రూరల్/ యానాం/ ముమ్మిడివరం: ఇస్రో పంపిన చంద్రయాన్-3 విక్రమ్ ల్యాండర్ మాడ్యూల్ బుధవారం సాయంత్రం 6.04 గంటలకు చంద్రుడి దక్షిణ ధ్రువంపై తన పాదాన్ని మోపింది. ఈ అద్భుత దృశ్యాలను టీవీ తెరలపై వీక్షించిన ప్రజలు ఆనందంలో మునిగితేలారు. ఇటు ఇళ్లు, అటు కళాశాలలు, పాఠశాలల్లో ప్రత్యక్ష ప్రసారాన్ని వీక్షిస్తూ ప్రజలు, విద్యార్థులు మురిసిపోయారు. ఊరూవాడా సంబరాలు జరుపుకొన్నారు. ముందుగా ఇది విజయవంతం కావాలని ప్రదర్శనలతో పాటు పూజలు చేశారు. అమలాపురం, ముమ్మిడివరం నియోజకవర్గాల్లో ఈ వేడుకలు అంబరాన్నంటాయి. అమలాపురంలోని సర్ సీవీ రామన్ స్కూల్ విద్యార్థులు సంబరాలు జరుపుకొన్నారు. స్కూల్ ప్రాంగణంలో 'జయహో చంద్రయాన్-3' అక్షరాలు తీర్చిదిద్ది వాటి చుట్టూ నిల్చుని జాతీయ జెండాలను చేతబూని రెపరెపలాడించారు. స్కూల్ డైరెక్టర్ రవణం వేణుగోపాలరావు, ప్రిన్సిపాల్ శ్రీనివాస్ పాల్గొన్నారు. అమలాపురం రూరల్ కామనగరువు ఆదిత్య స్కూల్‌లో సంబరాలు జరిగాయి. ఇస్రో భవిష్యత్‌లో మానవ సహిత అంతరిక్ష యాత్రలు చేయాలని ఆకాంక్షించారు. ప్రిన్సిపాల్ శ్రీరామప్రసాద్, వైస్ ప్రిన్సిపాల్ సుధ పాల్గొన్నారు.

- చంద్రుడిపై విక్రమ్ ల్యాండర్ కాలుమోపడంతో యానాం జవహర్ నవోదయ విద్యార్థులు, అధ్యాపకులు పెద్ద ఎత్తున చప్పట్లు కొడుతూ జైభారత్ అంటూ స్వీట్లు పంచుకున్నారు. ప్రిన్సిపాల్ టీవీఎస్ ప్రకాశరావు మాట్లాడుతూ చంద్రుడి ఉపరితలంపై చంద్రయాన్ కాలుమోపడంతో మన ఇస్రో సైంటిస్టులు అద్భుత విజయాన్ని అందుకున్నారన్నారు. ప్రస్తుతం తిరువనంతపురం ఇస్రోలో 15 రోజుల వర్క్‌షాప్‌నకు హాజరైన నవోదయ విద్యార్థి జ్ఞానశ్రీ సంతోషం వ్యక్తం చేసింది. ముమ్మిడివరం బాలాజీ కాన్వెంట్ విద్యార్థులు, ఉపాధ్యాయులు ర్యాలీ నిర్వహించారు. ఇస్రో శాస్త్రవేత్తలు దేశ కీర్తిని ప్రపంచ స్థాయికి చేర్చారంటూ శుభాకాంక్షలు తెలిపారు.

కాట్రేనికోన: చంద్రయాన్-3 విక్రమ్ ల్యాండర్ విజయవంతం కావడంతో ప్రముఖ చిత్రకారుడు ఆకొండి అంజి ఆనందం వ్యక్తం చేశారు. ఆ ఆనందంతో జయహో... చంద్రయాన్-3 పేరిట ఆయన గీసిన చిత్రం ఆకట్టుకుంది. అలాగే కుండలేశ్వరంలో పార్వతీ సమేత కుండలేశ్వరునికి, కనకదుర్గమ్మ తల్లికి అర్చకుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు జరిగాయి. గెద్దనాపల్లి పంచాయతీ చింతలమెరక పాఠశాల విద్యార్థులు స్వీట్లు పంచుకున్నారు.

ఐ.పోలవరం: చంద్రయాన్-3 విజయవంతం కావాలని మురమళ్ల వీరేశ్వరస్వామి ఆలయంలో చైర్మన్ పెన్మత్స వాసురాజు, ఈఓ మాచిరాజు లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో అర్చకులు, పురోహితులు పూజలు చేశారు.

అమలాపురం రూరల్: చంద్రయాన్-3 విజయవంతంలో అనేక మంది శాస్త్రవేత్తల కృషి ఉంది. ఇందులో బండారులంకకు చెందిన చేనేత కార్మికుడు పడవల నాగమల్లేశ్వరరావు, వరలక్ష్మిల కుమారుడు శాస్త్రవేత్త విజయ్ గణేష్ ఉన్నారు. దీంతో ఆ గ్రామంలో ఆనందోత్సాహాలు నెలకొన్నాయి.

అల్లవరం: చంద్రునిపై విక్రమ్ ల్యాండర్ సురక్షితంగా అడుగు పెట్టడంతో అల్లవరం మండలం దేవగుప్తానికి చెందిన ఇస్రో శాస్త్రవేత్త బలభద్ర సురేష్ బాబు ఇంట్లో సంబరాలు జరుపుకొన్నారు. సురేష్ బాబు తల్లిదండ్రులు కామేశ్వరరావు, భారతి స్వీట్లు అందించి శుభాకాంక్షలు తెలిపారు. లిక్విడ్ ప్రొపల్షన్ సిస్టమ్ కేంద్రంలో క్రయోజనిక్ దశల డిజైన్ గ్రూప్‌లో శాస్త్రవేత్తగా విధులు ఆయన నిర్వర్తిస్తున్నారు. ఇస్రో ప్రయోగించిన చంద్రయాన్ -3 సక్సెస్ కావడం తనకెంతో ఆనందంగా ఉందని సురేష్‌బాబు ఫోన్‌లో తెలిపారు.



ముమ్మిడివరంలో బాలాజీ కాన్వెంట్ విద్యార్థుల ర్యాలీ



కాట్రేనికోన చిత్రకారుడు ఆకొండి అంజి గీసిన చిత్రం


అమలాపురం సర్ సీవీ రామన్ స్కూల్ విద్యార్థుల ప్రదర్శన


ఆదిత్య విద్యార్థుల ఆనందోత్సాహం


శాస్త్రవేత్త విజయ్ గణేష్


శాస్త్రవేత్త కామేశ్వరరావు

టంగుటూరికి ఘన నివాళి


కలెక్టరేట్‌లో టంగుటూరి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కలెక్టర్ శుక్లా


తోటపేటలో టంగుటూరి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే పొన్నాడ సతీష్‌కుమార్

అమలాపురం టౌన్: స్థానిక గడియారం స్తంభం సెంటర్‌లో జిల్లా కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో బుధవారం ఆంధ్ర కేసరి టంగుటూరి ప్రకాశం పంతులు జయంతి వేడుకలను నిర్వహించారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు కామన ప్రభాకరరావు అధ్యక్షతన జరిగిన ఈ వేడుకల్లో పలువురు మాట్లాడుతూ ప్రకాశం పంతులు త్యాగాలను కొనియాడారు. పట్టణ పార్టీ కమిటీ అధ్యక్షుడు వంటెద్దు బాబి స్వీట్లు పంచారు. నాయకులు చీకట్ల అబ్బాయి, యార్లగడ్డ రవీంద్ర, అయితాబత్తుల సుభాషిణి, కుడుపూడి శ్రీను, పోలిశెట్టి హరిబాబు, పాల్గొన్నారు.

తాళ్లరేవు: పోలేకుర్రు పంచాయతీ తోటపేట అంబేడ్కర్ విగ్రహం వద్ద స్థానిక యూత్ ఆధ్వర్యంలో టంగుటూరి చిత్రపటానికి ఎమ్మెల్యే పొన్నాడ సతీష్‌కుమార్ పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టంగుటూరిని ప్రతి ఒక్కరూ స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. అలాగే స్థానిక మండల పరిషత్ కార్యక్రమంలోనూ వేడుకలు జరిగాయి.


అమలాపురం రూరల్: ఆంధ్ర కేసరి టంగుటూరి ప్రకాశం పంతులు దేశభక్తుడు, ప్రజా సేవకుడిగా ఖ్యాతి గడించారని కలెక్టర్ హిమాన్షు శుక్లా అన్నారు. స్థానిక కలెక్టరేట్‌లో టంగుటూరి జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్యాయాన్ని ఎదుర్కోవడంలో టంగుటూరికి ఎవరూ సాటిరారని అన్నారు. జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్.నుపూర్ అజయ్, డీఆర్వో సీహెచ్ సత్తిబాబు, ఏఓ కాశీ విశ్వేశ్వరరావు పాల్గొన్నారు.

ముమ్మిడివరం: టంగుటూరి ప్రకాశం పంతులు జయంతిని నగర పంచాయతీ కార్యాలయంలో జరిపారు. చైర్మన్ కమిడి ప్రవీణ్‌కుమార్, కమిషనర్ జి.లోవరాజు పాల్గొన్నారు.

పేదల అభ్యున్నతే ప్రభుత్వ ధ్యేయం

- ఎమ్మెల్యే పొన్నాడ సతీష్‌కుమార్
- పోలేకుర్రులో గడప గడపకూ..

తాళ్లరేవు: పేదల అభ్యున్నతే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తుందని ముమ్మిడివరం ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్ అన్నారు. బుధవారం పోలేకుర్రు పంచాయతీలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం జరిగింది. సర్పంచ్ వెంటపల్లి నూకరాజు, ఎంపీటీసీ సభ్యురాలు బళ్ల సంధ్యారాణి తదితర నాయకులతో కలసి ఎమ్మెల్యే ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. తోటపేట గ్రామంలో సీసీ రోడ్డుకు ఇరువైపులా బెర్మలు నిర్మించాలని, గృహ రుణాలు మంజూరు చేయాలని పలువురు లబ్ధిదారులు కోరారు. ఈ సమస్యలను తక్షణమే పరిష్కరించాలని అధికారులను ఆయన ఆదేశించారు. నాలుగున్నరేళ్లలో ప్రభుత్వ పథకాల ద్వారా జరిగిన లబ్ధిని వివరిస్తూ కరపత్రాలను ప్రజలకు అందజేశారు. ఎంపీపీ రాయుడు సునీత, పార్టీ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కాదా గోవిందకుమార్, రాయుడు గంగాధర్, వైస్ ఎంపీపీ ధూళిపూడి నాగేంద్రప్రసాద్, కొపనాతి నాగరాజు, ఎరికే వీరబాబు, దున్నా కొండ, పంచాయతీ కార్యదర్శి జ్యోతిసుధ, రేవు మల్లీశ్వరి, పెయ్యల మంగేష్ తదితరులు పాల్గొన్నారు.


పోలేకుర్రులో పథకాల గురించి వివరిస్తున్న ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్

సమస్యలను పరిష్కరించండి

అమలాపురం రూరల్: గ్రామాల్లో సమస్యలకు పరిష్కారం చూపాలని ప్రజాప్రతినిధులు అధికారులను నిలదీశారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ కుడుపూడి భాగ్యలక్ష్మి అధ్యక్షతన సర్వసభ్య సమావేశం జరిగింది. నాడు- నేడు పథకం మొదటి విడత ద్వారా బండారులంక హైస్కూల్లో అసంపూర్తిగా పనులు చేసి మొత్తం పూర్తయినట్లు అధికారులు ఎలా ధ్రువీకరణ పత్రం ఇచ్చారంటూ ఎంపీటీసీ అంకం హిమభారతి ప్రశ్నించారు. సాకుర్రు సర్పంచ్ గుత్తుల చిరంజీవిరావు మాట్లాడుతూ గ్రామంలో సమస్యలను పరిష్కరించాలన్నారు. విద్యుత్ శాఖ రూరల్ ఏఈ హరిబాబు మాట్లాడుతుండగా తాండవపల్లి ఎంపీటీసీ రేవు శ్రీనుబాబు అడ్డుతగిలి మీరు గ్రామాల్లోకి వచ్చి ఫోటోలు తీయించుకుని గ్రూపులో పెట్టడం కాదని, ముందు సమస్యలను పరిష్కరించాలన్నారు. ఆప్షన్ సభ్యుడు మొసలి స్వర్గన్, బీసీ కార్పొరేషన్ డైరెక్టర్ కరెళ్ల రమేష్ మాట్లాడుతూ సమనసలో ఏ సమస్యను పరిష్కరించారో చెప్పాలంటూ నిలదీశారు. వన్నెచింతలపూడి లేఅవుట్‌లో అడ్డంగా విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేస్తే ఎలా అంటూ ఏఈని ఎంపీపీ కుడుపూడి భాగ్యలక్ష్మి ప్రశ్నించారు. అమలాపురం వ్యవసాయ మార్కెట్ కమిటీ నూతన చైర్ పర్సన్‌గా చేపట్టిన దంగేటి డోలామణి రుద్రను దంపతులను సన్మానించారు. జెడ్పీటీసీ పందిరి శ్రీహరి రామ్‌గోపాల్, ఇమ్మిడివర్పాడు సర్పంచ్ రేలంగి దుర్గారావు, వైస్ ఎంపీపీ పాలమూరి బాలకృష్ణ పాల్గొన్నారు.


డోలామణి రుద్ర దంపతులను సత్కరిస్తున్న ఎంపీపీ తదితరులు

'ఆడుదాం ఆంధ్రా' పోటీలకు ఏర్పాట్లు చేయాలి

అమలాపురం టౌన్: ఆడుదాం ఆంధ్రా పేరుతో ఆంధ్రప్రదేశ్ క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో అక్టోబర్ 2వ తేదీ మహాత్మా గాంధీ జయంతిని పురస్కరించుకుని వివిధ దశల్లో క్రీడా పోటీలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేయాలని మున్సిపల్ కమిషనర్ ఒమ్మి అయ్యప్పనాయుడు ఆదేశించారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో అధికారులు, వార్డు సచివాలయ కార్యదర్శులతో ఆడుదాం ఆంధ్ర కార్యక్రమంపై ఆయన బుధవారం సమావేశం నిర్వహించారు. పట్టణ, మండల, నియోజకవర్గ, జిల్లా, రాష్ట్ర స్థాయిల్లో క్రీడా ప్రాధికార సంస్థ పోటీలు నిర్వహిస్తోందన్నారు. మున్సిపల్ మేనేజర్ మాచిరాజు మూర్తి ప్రసంగించి పలు సూచనలు చేశారు.

ఉప్పలగుప్తం: యువతలో క్రీడా స్ఫూర్తిని పెంచేందుకు కృషి చేయాలని ఎంఈఓ కె.కిరణబాబు అన్నారు. క్రీడాప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించనున్న ఆడుదాం ఆంధ్రా కార్యక్రమం నిమిత్తం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో పాఠశాల హెచ్ఎంలు, పీడీలు, పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. తహసీల్దార్ జె.వెంకటేశ్వరి, ఎంపీడీవో గౌరీకుమారి, ఎంఈవో-2 సత్తి సత్యకృష్ణ పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ నాయుడు

అల్లవరం: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ కృష్ణమోహన్ ఆధ్వర్యంలో 'ఆడుతాం ఆంధ్రా' కార్యక్రమంపై అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఎంపీపీ ఇళ్ల శేషగిరిరావు మాట్లాడుతూ సచివాయ స్థాయిలో 17 ఏళ్లు పైబడిన స్త్రీ, పురుష అభ్యర్థులు ఈ క్రీడల్లో పాల్గొనవచ్చన్నారు. క్రికెట్, బ్యాడ్మింటన్, వాలీబాల్, కోకో, కబడ్డీ విభాగాల్లో పోటీలు ఉంటాయన్నారు. సచివాలయ స్థాయిలో ఉత్తమ క్రీడాకారులను మండల స్థాయికి ఎంపిక చేస్తామన్నారు. ఆడుదాం ఆంధ్రా కార్యక్రమంపై ప్రజలకు వలంటీర్లు, సచివాలయ సిబ్బంది అవగాహన కల్పించాలన్నారు. ఎంఈఓలు కిరణ్‌కుమార్, ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు.

ఆంగ్లంపై పట్టు సాధించాలి

కాట్రేనికోన: విద్యార్థులు ఆంగ్ల భాషపై పట్టు సాధించాలని కళాశాల కరస్పాండెంట్ అండ్ సెక్రటరీ డీవీఎస్ఎస్ వర్మ అన్నారు. చెయ్యేరు శ్రీనివాస ఇంజినీరింగ్ అటానమస్ కళాశాలలో ప్రిన్సిపాల్ సీహెచ్‌వీఎస్ పరమేశ్వరరావు అధ్యక్షతన డిప్లమో మొదటి సంవత్సరం తరగతులను వర్మ ప్రారంభించారు. పాలకవర్గ సభ్యులు సందీప్, రమేష్‌రాజు, డిప్లమో విభాగాధిపతి ఎం.బాబ్జి, కళాశాల విద్యాశాఖాధికారి ఎస్.జయలక్ష్మి, బి.రత్నంరాజు తదితరులు ఉన్నారు.

కాలిబాట.. దిగుబడికి రాచబాట

- సాగులో సస్యరక్షణతో మేలు
- ఎరువులు, పురుగు మందుల వాడకానికి మార్గం


ముమ్మిడివరం: సాగులో సస్యరక్షణతోనే దిగుబడులు సాధించవచ్చు.. సిరులు పంట పండించొచ్చు. వరి సాగులో కాలిబాటలతో దిగుబడికి రాచబాట వేయొచ్చు. ఈ ప్రక్రియను వ్యవసాయ శాస్త్రవేత్తలు మూడు దశాబ్దాల కిందటే సిఫారసు చేశారు. ఫలితాలు కూడా అద్భుతంగా ఉన్నాయని పలువురు అభ్యుదయ రైతులు చెబుతున్నారు. నియోజకవర్గంలో ముమ్మిడివరం, ఐ.పోలవరం, కాట్రేనికోన, తాళ్లరేవు మండలాలు ఉన్నాయి. అయా చోట్ల 38 వేల ఎకరాల్లో ఖరీఫ్ సాగు జరుగుతోంది. కాలిబాటలు 20 శాతం వరకూ వేసుకుంటున్నారు. మరింత మందిని ఈ దిశగా ప్రోత్సహించేందుకు వ్యవసాయ అధికారులు తగిన చర్యలు తీసుకుంటున్నారు. ఖరీఫ్ సీజన్‌లో తూర్పు పడమరగా, రబీ సీజన్‌లో ఉత్తర దక్షిణ దిశలుగా కాలిబాటలు ఏర్పాటు వేసుకోవాలని వ్యవసాయ అధికారులు సూచిస్తున్నారు. 20 సెంటీమీటర్ల వెడల్పుతో ప్రతి రెండు మీటర్ల నిడివికి ఒకటి చొప్పున ప్రధాన పొలం అంతటా బాటలు తీయాలి. కాలిబాటలు తీసేటప్పుడు అక్కడ నాటిన మొనలు తగ్గిపోయి దిగుబడి తగ్గుతుందనే అపోహ ఇప్పటికీ పలువురు రైతుల్లో ఉంది. కానీ 20 సెంటీమీటర్ల ప్రాంతంలో తీసిన మొనలు పక్కనున్న ఖాళీల్లో నాటుతారు. అందువల్ల దిగుబడిపై ఎటువంటి ప్రతికూల ప్రభావాలు ఉండవు.


వరి పొలంలో ఏర్పాటు చేసిన కాలిబాటలు

ఉపయోగాలు ఇవీ..

పంట పొలంలో ఎరువులు వేయటానికి, పురుగు మందులు పిచికారీ చేసే సందర్భాల్లో ఈ కాలిబాటలు ఉపయుక్తంగా ఉంటాయి. పొలం విస్తీర్ణం అంతా సమాన పరిమాణంలో ఎరువులు, పురుగు మందులు చల్లడం సాధ్యమవుతుంది. సెప్టెంబరు నెలాఖరు నాటికి పూర్తిగా దుబ్బుచేసి వెన్ను అంకురం ఏర్పడే దశకు చేను వస్తుంది. ఆ దశలో వరి మొదలు నీటిమట్టం ఉండే ప్రదేశంలో గట్టిపడి తీపి ఎక్కువ అవుతుంది. కాలిబాటలు తీయకపోతే మొదలు భాగంలో చీకటిగా ఉండి వెలుతురు అందదు. ఆ ప్రదేశంలో మురుగునీరు బయటకు పోదు. దీనివల్ల చెడు వాసనతో కూడిన వాతావరణం మొదళ్లలో ఉంటుంది. ఈ పరిస్థితుల్లో సుడిదోమ ఉధృతి పెరిగే అవకాశం ఉంటుంది. అటువంటి సమస్యలు రాకుండా ఉండేందుకు రైతులు నాట్లు వేసేటప్పుడే కాలిబాటలు (పాయలు) కనీసం పది రోజులు వ్యవధిలో తీసుకోవాలి. కాలిబాటలతో సుడిదోమ నివారణ సాధ్యమవుతోంది. తద్వారా దిగుబడులపై ప్రభావం ఉండదు.

ఆసక్తి చూపాలి


ముందస్తుగా నాట్లు వేసినప్పుడే కాలిబాటలు ఏర్పాటు చేసుకోవాలనే ఆసక్తి రైతుల్లో ఉండాలి. అవసరమైతే ఇద్దరు కూలీలను అదనంగా పెట్టుకోవాలి. సుడిదోమ నివారణ, ఇతర ఉపయోగాలు పొందేందుకు కాలిబాటల ఏర్పాటు అవసరం.

–ఎస్.ప్రశాంత్‌కుమార్, వ్యవసాయాధికారి, ముమ్మిడివరం

అలవాటుగా మారింది


వ్యవసాయశాఖ అధికారుల సూచనలతో ఖరీఫ్ సాగు చేపడుతున్నాను. ఏటా విత్తన మార్పిడి చేస్తుంటాను. 20 ఏళ్లుగా వరిలో కాలిబాటలు ఏర్పాటు చేయడం అలవాటుగా మారింది. నాట్లు వేసినప్పుడు ముందుగా మార్కింగ్ ఇచ్చి కాలిబాటలు వేస్తున్నా. ఈ విధానం సత్ఫలితాలను ఇస్తుంది.

–కొమ్మిరెడ్డి శ్రీనివాసరావు, రైతు, గాడిలంక

ప్రతి ఇంటా సంక్షేమ వసంతం


పేరూరులో మహిళకు పథకాల బుక్‌లెట్ అందిస్తున్న డాక్టర్ శ్రీకాంత్

అమలాపురం రూరల్: వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో పేదల ఇంటికి సంక్షేమ వసంతం వచ్చిందని మంత్రి పినిపే విశ్వరూప్ తనయుడు డాక్టర్ పినిపే శ్రీకాంత్ అన్నారు. పేరూరు 10వ వార్డు నారాయణపేట పరిధిలోని రెల్ల కాలనీ, పోస్టల్ కాలనీ, పల్లి వెంకట్రావు వీధి తదితర ప్రాంతాల్లో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాల గురించి వివరించి, ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా శ్రీకాంత్ మాట్లాడుతూ కుల, మతాలకు అతీతంగా అర్హులందరికీ పథకాలు అందజేస్తున్నామని తెలిపారు. ఎంపీపీ కుడుపూడి భాగ్యలక్ష్మి, జెడ్పీటీసీ పందిరి శ్రీహరి రామ్‌గోపాల్, మున్సిపల్ చైర్‌పర్సన్ రెడ్డి సత్య నాగేంద్రమణి, మండల వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు బొంతు గోవిందశెట్టి, గ్రామ సర్పంచ్ అరుణ డేవిడ్, గ్రామ కమిటీ అధ్యక్షుడు చొల్లంగి సుబ్బరామ్, మంగళంపల్లి అంజిబాబు తదితరులు పాల్గొన్నారు.

పని ఒత్తిడి తగ్గించాలి

ఉప్పలగుప్తం: స్కీం వర్కర్లకు పని ఒత్తిడి తగ్గించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి గుదే దుర్గాప్రసాద్ కోరారు. గొల్లవిల్లిలో వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కారెం వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో స్కీం వర్కర్లతో బుధవారం సమావేశం నిర్వహించారు. సీఐటీయూ నాయకురాలు పి.బేబీ గంగారత్నం, పి.ప్రసాద్, సుబ్బలక్ష్మి, బాలామణి, కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

పరిహారం మంజూరు

యానాం: ఓఎన్‌జీసీ సంస్థ సముద్రం నుంచి గోదావరి మీదుగా పి.మల్లవరం ఆన్‌షోర్ టెర్మినల్ వరకూ రెండో గ్యాస్ పైపులైన్ వేస్తున్న నేపథ్యంలో నష్టపోతున్న దరియాలతిప్ప ఎస్సీ ఫీల్డ్ లేబర్ సొసైటీ భూముల రైతులకు నష్ట పరిహారం మంజూరైనట్లు ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ మొత్తం 19 మందికి పరిహారం మంజూరైందన్నారు.

వైఎస్సార్ బీమా సాయం పంపిణీ

ఉప్పలగుప్తం: విలసవిల్లిలో మృతి చెందిన వ్యక్తి కుటుంబానికి సర్పంచ్ సలాది ఊర్మిళాదేవి ఆధ్వర్యంలో వైఎస్సార్ బీమా సాయం బుధవారం అందజేశారు. కొండేటి రాంబాబు (33) అనారోగ్యంతో మృతిచెందగా అతని భార్య సత్యవతికి బీమా తక్షణ సాయంగా రూ.10 వేలు అందించి, మిగతా నగదు నేరుగా ఖాతాలో జమ అవుతుందని సర్పంచ్ తెలిపారు. వైఎస్సార్ సీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు సలాది సతీష్, కోలా ఏసు, వీపీ శ్రీలక్ష్మి, భీమవరపు నరేష్, కొండేటి రాజు, గిరి తదితరులు పాల్గొన్నారు.

ఈ- పంట నమోదు వేగవంతం

అల్లవరం: వరి క్షేత్రాలకు ఈ-పంట నమోదును త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా వ్యవసాయాధికారి వి.బోసుబాబు అన్నారు. తాడికోనలో ఈ-పంట నమోదును బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో 2,600 ఎకరాల్లో నాట్లు వేయగా 1200 ఎకరాల్లో ఈ-పంట నమోదు జరిగిందన్నారు. వరి నాట్లు పూర్తయిన ప్రాంతాల్లో ఈ- పంట నమోదు వేగవంతం చేయాలని వ్యవసాయ సహాయకుల్ని ఆదేశించారు. ఏడీ షంషీ, వ్యవసాయాధికారులు ఎన్‌వీవీ సత్యనారాయణ, పవన్‌కుమార్, వీఏఏలు శ్రావణి, బిలాల్, మణికంఠ పాల్గొన్నారు.

పలువురికి ఎమ్మెల్సీ పరామర్శ

అల్లవరం: గోడిలంకలో భార్య వియోగంతో ఉన్న గోడిలంక సొసైటీ సీఈఓ ముషిణి నరసింహారావును ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్ బుధవారం పరామర్శించారు. గోడిలో మాతృ వియోగంతో ఉన్న రుద్రరాజు సూర్యానారాయణరాజు (శ్రీనురాజు)ను ఆయన నివాసంలో బుధవారం కలసి సంతాపం తెలిపారు.

వైద్యురాలికి సత్కారం

తాళ్లరేవు: స్థానిక సామాజిక ఆసుపత్రిలో కమ్యూనిటీ హెల్త్ సెంటర్ సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్న శిరీషను పలు దళిత సంఘాల నాయకులు బుధవారం సత్కరించారు. ఉత్తమ సేవా పురస్కారం అందుకున్న సందర్భంగా విశ్వజన కళామండలి, మండల దళిత యునైటెడ్ వెల్ఫేర్ అసోసియేషన్, కుల వివక్ష పోరాట సమితి ఆధ్వర్యంలో శిరీషను సన్మానించారు. విశ్వజన కళామండలి జిల్లా అధ్యక్షుడు వడ్డి ఏడుకొండలు, ఎండీయూడబ్ల్యూఏ అధ్యక్షుడు పెయ్యల రమేష్, దళిత నాయకులు వాకపల్లి చిరంజీవి, రేవు శ్రీను, తాడి షణ్ముఖరాజు తదితరులు పాల్గొన్నారు.

కొత్త కార్యవర్గం ఎన్నిక


కూరగాయల మార్కెట్ వర్తక సంఘం విజయోత్సవం

అమలాపురం టౌన్: స్థానిక శ్రీగణపతి కూరగాయల మార్కెట్ వర్తక సంఘం కొత్త కార్యవర్గం ఎన్నిక ఏకగ్రీవంగా జరిగింది. ఆ కూరగాయల మార్కెట్‌లో వ్యాపారులు బుధవారం సమావేశమై ఈ కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. సంఘ గౌరవాధ్యక్షుడు వలవల వెంకటేశ్వరరావు, గౌరవ ముఖ్య సలహాదారు వాకపల్లి స్వామినాయుడు సమక్షంలో నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారం చేసింది. సంఘ అధ్యక్షునిగా నల్లా పట్టాభి (బాబ్జి), ఉపాధ్యక్షుడిగా కంచిపల్లి కోటేశ్వరరావు, ప్రధాన కార్యదర్శిగా నల్లా కుమార్, కార్యదర్శిగా నక్కా రామకృష్ణ, కోశాధికారిగా కొమ్మూరి నాగ భీమేశ్వరరావు (చిట్టి), సభ్యులుగా గుండాబత్తుల దొరబాబు, అక్కిరెడ్డి సత్తిబాబు, రంకిరెడ్డి బుల్లెబ్బాయి, గోకరకొండ శ్రీను ఎన్నికయ్యారు. అనంతరం విజయోత్సవం నిర్వహించారు.